క్లుప్తంగా

వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు



వ్యాసరచన పోటీ విజేతలకు బహుమతులందిస్తున్న నిర్వాహకులు

పర్చూరు (చినగంజాం): అంబేడ్కర్ 135 వ జయంతిని పురస్కరించుకొని చీరాల గేరాడ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆధునిక భారత దేశంలో అంబేడ్కర్ రాజ్యాంగం సరైన రీతిలో సంతృప్తికరంగా అమలవుతుందా ? అనే అంశంపై ఆదివారం పర్చూరులో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన కట్టా సురేంద్ర, సాతులూరి కీర్తన, కంచర్ల పుష్పలత, ఎస్ శాంతిలకు నగదు చెక్‌లను, భారత రాజ్యాంగం పుస్తకాలను బహుమతులుగా అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ గేరా అశోక్ బాబు మాట్లాడుతూ గేరాడ్స్ ఫౌండేషన్ భారత రాజ్యాంగం గురించి ప్రజల్లో అవగాహన కలిగించేందుకు చేసిన కార్యక్రమం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ అల్లాడి కనకరత్నం, ట్రస్టీలు తానికొండ జయానంద్, గేరా స్వరాజ్ కుమార్, గోళ్లమూడి రాజేష్, ఎం సంతోషం తదితరులు పాల్గొన్నారు.



రక్షిత మంచినీటి చెరువు



చెరువు పరిసరాల్లో సంచరిస్తున్న నక్క



చెరువు గట్లపై ఏపుగా పెరిగిన ముళ్లచెట్లు

చిట్టడవిలా చీరాల చెరువు

- చెరువు గట్లపై ఏపుగా పెరిగిన చిల్లచెట్లు
- పాములు, నక్కలు, అడవిపందులకు ఆవాసంగా మారినవైనం
- విధులు నిర్వర్తించేందుకు ఇబ్బంది పడుతున్న సిబ్బంది

చీరాల రూరల్: చీరాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి చెరువు చిట్టడవిని తలపిస్తోంది. చెరువు గట్లపై చిల్లచెట్లు, ముళ్లపొదలు ఏపుగా పెరగడంతో విధులు నిర్వర్తించలేక అక్కడ పనిచేస్తున్న సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నారు. మరీ ముఖ్యంగా రాత్రి సమయాల్లో విధులు నిర్వర్తించాలంటే ప్రాణసంకటంగా ఉందని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో అడవి పందులను పట్టుకోవటానికి నక్కలు చేసే హడావుడి, వాటి కోసం కుక్కలు పెట్టే పరుగులు, ఎటువైపు నుంచి పాములు వచ్చి కాటు వేస్తాయోనని అర్థంకాక సిబ్బంది ఆవేదన చెందుతున్నారు.

చీరాల శివారు ప్రాంతం చీరాల నుంచి కారంచేడు వెళ్లే రోడ్డు మార్గంలో 1963లో చీరాల పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు రక్షిత మంచినీటి చెరువు నిర్మించారు. చెరువులో నీరు అడుగంటే సమయాల్లో కారంచేడు మీదుగా ప్రవహించే కృష్ణా కాలువ నుంచి నీటిని పంపింగ్ చేసి నింపుతారు. ప్రస్తుతం చెరువులో నీరు పుష్కలంగా ఉంది. కానీ చెరువు గట్లే దారుణంగా తయారయ్యాయి.

విధులకు ప్రాణ సంకటం!

రక్షిత మంచినీటి చెరువు వద్ద 8 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది షిఫ్టుల ప్రకారం విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిని ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తుంటారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది చెరువు గట్లు నలుమూలలకు తిరుగుతూ విధులు నిర్వర్తించాల్సి ఉంది. అయితే చెరువుగట్లపై ముళ్లచెట్లు, చిల్లచెట్లు ఏపుగా పెరిగిపోవడంతో సిబ్బంది ఆ ప్రదేశాల్లో కాలుపెట్టే అవకాశం లేకుండాపోయింది. చెరువుగట్లపై జనసంచారం లేకపోవడంతో సుమారుగా 15 వరకు నక్కలు, అడవి పందులు ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నాయి. రాత్రి వేళ పాములు అధికంగా సంచరిస్తుండటంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పనిచేయాల్సి వస్తోందని సిబ్బంది వాపోతున్నారు. ఇటీవల పంపుసెట్ల వద్ద పరిసరాలను డోజర్‌తో శుభ్రం చేస్తుండగా రెండు పాములు బుసకొడుతూ సిబ్బందిపైకి దూసుకురాగా వాటిని చంపేశారు. అదేరోజు రాత్రి మరో రెండు పాములు సిబ్బంది నిద్రిస్తున్న ప్రదేశానికి రావడంతో లైట్ల వెలుగులో వాటిని చూసి తప్పించుకోగలిగారు. అడవి పందులు, నక్కలు సమీపంలోని పంట పొలాలను నాశనం చేస్తున్నాయని కొందరు రైతులు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు కూడా చేశారు. చెరువు శివారు ప్రాంతంలో కొందరు పశుపోషకులు తమ పశువులను చెరువులోకి దించి వాటి దాహార్తిని తీర్చుతున్నారు. మరికొందరు ఆ నీటితోనే వాటిని శుభ్రం చేస్తున్నారు. అయినా అధికారుల్లో ఏ మాత్రం స్పందన లేదు.

బలహీనమవుతున్న గట్లు

రక్షిత మంచినీటి చెరువు గట్లపై ఎటువంటి చెట్లు, ముళ్లపొదలు ఉండకూడదు. ఏపుగా పెరిగిన చిల్లచెట్ల వేర్లు గట్లను బలహీనంగా మార్చే ప్రమాదం ఉంది. చెరువును పూర్తిస్థాయిలో నీటితో నింపాలంటే గట్లు బలంగా ఉండాలి. చెరువు పరిసరాల్లో ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి గట్ల వద్ద సాధారణ పరిస్థితులు ఉంటేనే సాధ్యపడుతుంది. ఈ నేపథ్యంలో చెరువు గట్లను శుభ్రం చేయాల్సిన అవసరం ఉంది. పట్టణ ప్రజల దాహార్తి తీర్చే రక్షిత మంచినీటి చెరువుపై మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సమస్యను కౌన్సిల్‌లో పెట్టాం

చెరువుగట్లపై ముళ్ల చెట్లు ఏపుగా పెరిగిన మాట వాస్తవమే. అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి కూడా ఇబ్బందిగా ఉంది. గట్లపై జంగిల్ క్లియరెన్స్ చేయాలని ఇటీవల కౌన్సిల్ సమావేశంలో తీర్మానించారు. చెట్లు తొలగించాలంటే రూ.5 లక్షలు ఖర్చవుతాయని ఎస్టిమేషన్స్ కూడా వేయించాం. అనుమతులు రాగానే పనులు మొదలుపెడతాం.

– టి.రఘురామ్, మున్సిపల్ డీఈ, చీరాల



పంపుల వద్ద శుభ్రం చేస్తుండగా చెత్తలో దాగిన పాము(ఫైల్)

క్రీస్తు పునరుత్థానమే ఈస్టర్



యద్దనపూడిలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



అద్దంకి బిక్షాలు కాలనీలో ప్రత్యేక ప్రార్థనల్లో క్రైస్తవులు



బల్లికురవలో ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

- ఘనంగా ఈస్టర్ ప్రార్థనలు

కారంచేడు: ఏసుక్రీస్తు ఈలోకంలో మానవ రూపంలో జన్మించి పాపుల కోసం శిలువపై మరణించి, సమాధి అయిన మూడో దినాన తిరిగి లేచారని, ఆ రోజును క్రైస్తవులు ఈస్టర్ పండుగగా జరుపుకుంటామని లూర్దుమాత చర్చి విచారణ గురువు ఫాదర్ విజయ్‌సందీప్‌రెడ్డి అన్నారు. 40 రోజులుగా స్థానిక లూర్దుమాత చర్చి సంఘంలో క్రైస్తవులు ఉపవాస ప్రార్థనలు చేస్తున్నారు. మండల కేంద్రమైన కారంచేడు లూర్దుమాత దేవాలయం ప్రాంగణంలో ఆదివారం విద్యుత్ దీపాల కాంతిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం దివ్య బలిపూజ చేశారు. కార్యక్రమంలో ఫాదర్‌లు, సిస్టర్స్, సంఘ పెద్దలు, క్రైస్తవులు పాల్గొన్నారు. మండలంలోని స్వర్ణ, కుంకలమర్రు, ఆదిపూడి, దగ్గుబాడు, జరుబులవారిపాలెం, కొడవలివారిపాలెం, నందిగుంటపాలెం, కేశవరప్పాడు గ్రామాల్లోను ఈస్టర్ పర్వదిన ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



చీరాలలో ఈస్టర్ సందేశాన్నిస్తున్న సెయింట్‌మార్క్స్ లూథరన్ చర్చి పాస్టర్

భక్తి శ్రద్ధలతో 'ఈస్టర్' పండుగ

చీరాల టౌన్: ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం చీరాల పట్టణంతో పాటు చీరాల మండలంలోని అన్ని గ్రామాల్లోని క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో పెద్ద ఎత్తున క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. స్థానిక సెయింట్ మార్క్స్ లూథరన్ చర్చిలో జరిగిన ప్రార్థనల్లో అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు. మరియమ్మపేటలోని పునీత ఆంటోని దేవాలయం, జయంతిపేట, పేరాల బ్రాంచి చర్చి, బెరాకా, సెయింట్‌పాల్స్ చర్చిలతో పాటు పట్టణం, మండలంలోని గ్రామాల్లో ఉన్న అన్ని ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవులు తెల్లవారుఝామునే శ్మశాన వాటికలకు వెళ్లి చనిపోయిన వారి సమాధులపై వివిధ రకాల పూలతో అలంకరించి కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేసి వారిని జ్ఞప్తికి తెచ్చుకొని ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణంలోని క్రైస్తవ శ్మశాన వాటికల్లోని సమాధులను పూలతో అలంకరించారు. కార్యక్రమాల్లో చర్చి ఫాదర్లు, సంఘ కాపర్లు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



కారంచేడులో ఈస్టర్ ప్రార్థనల్లో పాల్గొన్న చర్చి ఫాదర్లు



చీరాలలో సమాధులను రంగులతో, పూలతో, కొవ్వొత్తులతో అలంకరించి ప్రార్థిస్తున్న క్రైస్తవులు

ఘనంగా ఈస్టర్ పండుగ

యద్దనపూడి: ఏసుక్రీస్తు పునరుత్థానం చేసిన మహోన్నతమైన రోజు ఈస్టర్ అని, క్రైస్తవులు పునరుత్థాన శక్తితో ఆధ్యాత్మికంగా పునీతులు కావాలని రెవరెండ్ రిచర్స్ పచ్చ అన్నారు. ఈస్టర్ పండుగను పురస్కరించుకొని మండలంలోని అన్ని గ్రామాల్లోని చర్చిల్లో మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధనలు నిర్వహించారు.

వాడవాడలా ఈస్టర్ వేడుకలు

బల్లికురవ: ఏసుక్రీస్తు పునర్జీవానికి, మరణంపై సాధించిన విజయానికి ప్రతీకే ఈస్టర్ అని బల్లికురవ, కొణిదెన చర్చి పాస్టర్‌లు బండారు సురేష్‌కుమార్, గీతా మాధురి, ఉప్పలపాటి దావీదు అన్నారు. ఈస్టర్ వేడుకలు ఆదివారం మండలంలో వాడవాడల ఘనంగా నిర్వహించారు. బల్లికురవ, కొణిదెన, వల్లాపల్లి, మల్లాయపాలెం, చెన్నుపల్లి, కొప్పరపాలెం, కొణిదెన, మల్లాయపాలెం, బల్లికురవ, వల్లాపల్లి, కూకట్లపల్లి, కొప్పరపాడు, నక్కబొక్కలపాడు గ్రామాల్లోని చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు ప్రార్థనలు నిర్వహించారు. ఏసునామంతో ర్యాలీ నిర్వహించారు.

ఆనందోత్సాహాలతో ఈస్టర్ పండుగ

అద్దంకి: ఈస్టర్ పండుగను క్రైస్తవులు ఆదివారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లోని క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దానిలో భాగంగా అద్దంకి పట్టణంలోని కట్టకిందపాలెం, పాసుమర్తిపాలెం, టౌన్, రాజీవ్‌నగర్ కాలనీ, గరటయ్య కాలనీ, ఎన్టీఆర్ నగర్, తదితర కాలనీల్లోని చర్చిల్లోనూ, మండలంలోని గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలు చోట్ల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. బిక్షాలు కాలనీలోని చర్చిలో బ్రదర్ ఇటికాల యేహాన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హాజరైన వారికి మజ్జిగ పంపిణీ చేశారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి



గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం

సంతమాగులూరు (అద్దంకి రూరల్): మండలంలోని పాతమాగులూరు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అపస్మారక స్థితిలో ఉన్న గుర్తు తెలియని వృద్ధుడు (60) సంతమాగులూరు వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. వృద్ధుడి పేరు, వివరాలు తెలియలేదు. అతని ఒంటిపై తెల్లచొక్కా, లుంగీ ధరించి ఉన్నాడు. మృతుడి వివరాలు తెలిస్తే సంతమాగులూరు ఎస్సై నంబర్ 9121102168 కు తెలియజేయాలన్నారు.

ఘనంగా పేరాల పోలేరమ్మ తల్లి తిరునాళ్ల

చీరాల: పట్టణంలోని పేరాలలో వేంచేసియున్న పోలేరమ్మ తల్లి తిరునాళ్లను ఘనంగా నిర్వహిస్తున్నారు. 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఐదు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలతో తిరునాళ్ల ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం పేరాల యాదవపాలెం నుంచి 200 మంది మహిళలు తీర్థ బిందెలతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



తీర్థబిందెలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం

- ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



ఐటీసీలో నిర్వహించిన వర్క్‌షాపును పరిశీలిస్తున్న జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి రామకృష్ణ

చీరాల అర్బన్: అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు సరైన జాగ్రత్తలు పాటించడం వలన ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా అసిస్టెంట్ అగ్నిమాపక అధికారి రామకృష్ణ అన్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు వాటిని వెంటనే నియంత్రించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆదివారం చీరాలలోని ఐటీసీలో వర్క్‌షాపు నిర్వహించారు. వారం రోజులుగా చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించి అగ్ని ప్రమాదాల నివారణ చర్యలను సిబ్బందికి ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో ఐటీసీ జనరల్ మేనేజర్ శ్యామ్‌సుందర్, ఈహెచ్‌ఎస్ సీనియర్ మేనేజర్ ఎంఎస్‌ఎస్ రెడ్డి, చీరాల అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.



మంటలను ఆర్పివేయడంపై మాక్ డ్రిల్‌తో వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

భవనం భద్రిరెడ్డి సేవలు అభినందనీయం

- ప్రకాశం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

వేటపాలెం: ఉపాధ్యాయ వృత్తిలో నిబద్ధత, నిజాయితీతో విద్యార్థులకు మంచి విద్యనందించిన భవనం భద్రిరెడ్డి సేవలు అభినందనీయమని ప్రకాశం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని అక్కాయిపాలెం జెడ్పీహెచ్‌ఎస్‌లో హెచ్‌ఎంగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేస్తున్న భద్రిరెడ్డికి సన్మాన సభ నిర్వహించారు. ఈ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరైన వెంకాయమ్మ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం భద్రిరెడ్డికే చెల్లిందన్నారు. తాను పనిచేస్తున్న స్కూల్ అభివృద్ధికి ఎంతో తోడ్పాటు అందించారన్నారు. అంతేకాకుండా ఎందరో విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దారని కొనియాడారు. పాఠశాల అభివృద్ధికి జిల్లా పరిషత్ నుంచి ప్రత్యేక చర్యలు చేపడతామని ఆమె తెలిపారు. అనంతరం భద్రిరెడ్డి దంపతులను చైర్‌పర్సన్, సహచర ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ యర్రం వెంకటేశ్వరరెడ్డి, వివిధ మండలాల ఎంఈఓలు శివకోటేశ్వరరావు, నాగేశ్వరావు, వీరాంజనేయరావు, వెంకట రామయ్య, ఎం వెంకటేశ్వర్లు, వడలి రాధాకృష్ణ, బత్తుల ట్రస్ట్ అధ్యక్షుడు బత్తుల బ్రహ్మారెడ్డి, హెచ్‌ఎంలు శ్రీనివాసరావు, ఫణి సత్యనారాయణ, శేఖర్, మాల్యాద్రి, రత్నకుమారి పాల్గొన్నారు.



హెచ్‌ఎం భద్రిరెడ్డి దంపతులను సన్మానించిన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

వైభవంగా వీరాంజనేయుని తిరునాళ్ల

బల్లికురవ: మండలంలోని వెలమవారిపాలెం గ్రామ సమీపంలో వేంచేసిఉన్న వీరాంజనేయస్వామి వార్షిక తిరునాళ్ల ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్య శర్మచే ఉదయం 5 గంటల నుంచే వీరాంజనేయునికి పంచామృతాలతో అభిషేకం, ప్రత్యేక పూజలు, తమలపాకులతో అర్చన చేశారు. గ్రామంతోపాటు పరిసర గ్రామాల్లోని భక్తులు ఆలయ సన్నిధికి చేరి పొంగళ్లు పెట్టి స్వామివారికి నివేదించారు. మొక్కులు తీర్చుకున్నారు. అనేక మొక్కుబడి ప్రభలతోపాటు భారీ ఎలక్ట్రిక్ ప్రభతో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసంతర్పన చేపట్టారు.



అలంకరణలో వీరాంజనేయస్వామి

ప్రతిభ కలిగిన క్రీడాకారులు తయారు కావాలి



వేసవి కబడ్డీ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ నల్లూరి సుబ్బారావు, కబడ్డీ అసోసియేషన్ ప్రముఖులు



శిక్షణకు హాజరైన క్రీడాకారులతో కబడ్డీ అసోసియేషన్ సభ్యులు

- డాక్టర్ నల్లూరి సుబ్బారావు
- వంద మంది బాలురతో కబడ్డీ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

చినగంజాం: కబడ్డీ వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతిభ కలిగిన క్రీడాకారులుగా తయారు కావాలని డాక్టర్ నల్లూరి సుబ్బారావు అన్నారు. చినగంజాం ఎంఎస్‌ఆర్ జూనియర్ కాలేజీ ఆవరణలో ఆదివారం ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్, బాలకోటేశ్వర స్పోర్ట్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ వేసవి శిక్షణ శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. వేసవి శిక్షణ శిబిరానికి చినగంజాం చుట్టు పక్కల గ్రామాల నుంచి సుమారు 100 మంది బాలురు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ కబడ్డీ ఆటకు సంబంధించిన మెళకువలను అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు, బాలకోటేశ్వర స్పోర్ట్స్‌క్లబ్ కబడ్డీ కోచ్ ఎం గిరిబాబు ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చి ప్రతిభ కలిగిన క్రీడాకారులుగా తీర్చిదిద్దుతారని అన్నారు. శిబిరంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు పౌష్టికాహారం అందించేందుకు, క్రీడా దుస్తులు సమకూర్చేందుకు తన వంతుగా రూ.1 లక్ష నగదు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ డాక్టర్ సుబ్బారావుకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు, తెలంగాణ డీఎస్పీ ఏ వేణుగోపాల్, ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు చైర్మన్ ఎన్ చంద్రమోహన్‌రెడ్డి, ప్రెసిడెంట్ కుర్రా భాస్కరరావు, సెక్రటరీ వై పూర్ణచంద్రరావు, ట్రెజరర్ డీ రమేష్, వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

దళితులు, క్రైస్తవులపై కూటమి ప్రభుత్వం కక్ష

చీరాల రూరల్: దళితులన్నా.. క్రైస్తవులన్నా కూటమి ప్రభుత్వానికి మింగుడు పడటంలేదని వారిపై నిత్యం దాడులుచేయిస్తూ అక్రమ కేసులు బనాయిస్తూ విషం కక్కుతోందని దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మాచవరపు జూలియన్ అన్నారు. ఆదివారం స్థానిక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణంపై అనేక అనుమానాలు ఉన్నాయని పాస్టర్ అజయ్‌బాబు మాట్లాడితే అయనను అన్యాయంగా కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా అరెస్టు చేసిందన్నారు. ఈ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. అలానే మాజీ ఎంపీ హర్షకుమార్ ప్రవీణ్ మృతి చెందిన చోట కొవ్వొత్తులతో ర్యాలీ చేద్దామని పిలుపునిస్తే ఆయనను కూడా అక్రమంగా అరెస్టు చేశారన్నారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి అధికారంలోని వచ్చిన కూటమి ప్రభుత్వ పెద్దలు వారి ఇష్టానుసారంగా పాలన సాగిస్తున్నారని ఇది మంచిపద్ధతి కాదని హితవు పలికారు. అలానే ముస్లిం ఆస్తులకు సంబంధించి వక్ఫ్‌బోర్డును నిర్వీర్యం చేసి బడా వ్యాపారవేత్తలకు దోచిపెట్టేందుకు కేంద్రం కుయుక్తులు పన్నుతుందని విమర్శించారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్ మల్లెల బుల్లిబాబు, మేరిగ రమేష్‌బాబు, దిలీప్, న్యాయవాది టీ విజయకుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జూలియన్